పేదల ఆరోగ్యానికి ప్రభుత్వ రక్షణ

- జగనన్న ఆరోగ్య సురక్షతో వైద్య పరీక్షలతో పాటు మెరుగైన చికిత్స
- గ్రామాల్లో వైద్య శిబిరాల ఏర్పాటుపై హర్షం



మారెల్ల వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి,



చింతకుంట శిబిరంలో వైద్య సేవలందిస్తున్న సిబ్బంది

తుగ్గలి: పేదల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. బుధవారం మారెల్లలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. వైద్య సేవల కోసం గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. శిబిరాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదల ఆరోగ్యం కోసం ప్రభుత్వ చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. పోషకాహారంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్ ఎర్రం సుగునాథమ్మ గౌరవ సలహాదారు సుధాకరరెడ్డి, సచివాలయ కన్వీనర్ లింగన్న, వెంకటేష్‌గౌడ్, బాలు, మద్దిలేటి, ఎంపీడీఓ సావిత్రి, డీటీ నిజాముద్దీన్, వైద్యులు ప్రవీణ్, హరిత పాల్గొన్నారు.

● **వెల్దుర్తి:** మండల పరిధిలోని గోవర్ధనగిరి–2 సచివాలయం పరిధిలోని గోవర్ధనగిరి, చెర్లకొత్తూరు ప్రజలకు బుధవారం గ్రామ జెడ్పీ హైస్కూల్‌లో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాసరావ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డీటీ ప్రసాద్ రాజు, సర్పంచ్ ఎల్లరాముడు, వైఎస్సార్‌సీపీ నాయకులు జయరాముడు, రంగడు పాల్గొన్నారు. రెండు గ్రామాలకు చెందిన 350 మంది స్పెషలిస్టు డాక్టర్లచే ఉచితంగా వైద్యసేవలు, మందులు పొందారు. ఈసీజీ లాంటి ఖరీదైన పరీక్షలు చేయించుకున్నారు. పలువురు కంటి అద్దాలు, ఆయుష్మాన్, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులు అందుకున్నారు. స్పెషలిస్ట్ వైద్యులు శ్రీధర్ రెడ్డి, భువనతేజ, పవన్‌తేజ, కిరణ్‌కుమార్, కవిత సేవలందించారు. ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండల పరిధిలోని మల్లెపల్లె గ్రామ ఎంపీపీ స్కూల్‌లో గురువారం హెల్త్ క్యాంప్ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావ్ తెలిపారు.

● **ఎమ్మిగనూరురూరల్:** జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదల పాలిట వరమని సర్పంచ్ వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. దేవబెట్ట గ్రామ వైద్య శిబిరంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలు శిబిరంలో ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. వైద్య సిబ్బంది పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి కళ్లద్దాలుఅందజేశారు. ఈఓఆర్డీ విజయలక్ష్మి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

● **పత్తికొండ రూరల్:** జనరంజకమైన పథకాలతో పాటు ప్రజారోగ్యానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత కల్పిస్తుందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. బుధవారం నలకదొడ్డి గ్రామ సచివాలయంలో ఏర్పాటుచేసిన జగనన్న సురక్ష క్యాంపునకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. హెల్త్ క్యాంపుకు వచ్చిన వారికి మెరుగైన వైద్యం అందించేలా చూడాలని వైద్యులకు సూచించారు. అనంతరం పౌష్టికాహార స్టాల్స్‌ను పరిశీలించారు. రైతులకు సబ్సిడీ శనగలను పంపిణీ చేశారు. ఎంపీపీ నారాయణదాస్, ఎంపీడీఓ కవిత, జెడ్పీటీసీ గుజ్జుల ఉరుకుందమ్మ, తదితరులు పాల్గొన్నారు.

● **హాలహర్వి:** ప్రతిఒక్కరూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సత్యవతి, ఎంపీడీఓ ఆంతోని, తహసీల్దార్ మల్లికార్జునస్వామి అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని చింతకుంట గ్రామంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సీనియర్ డాక్టర్లు మన్సూర్‌వలీ, గంగాధర్, ఈరన్న, తిమ్మన్న తదితరులు బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ వంటి 14 రకాల వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అక్కడే ఏర్పాటుచేసిన పోషకాహార స్టాళ్లను డిప్యూటీ డీఎంహెచ్‌ఓ పరిశీలించి ప్రజలకు పౌష్టికాహార ప్రాధాన్యతను వివరించారు.

● **దేవనకొండ:** పి.కోటకొండలో సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీడీఓ ఇద్రూస్‌బాషా, మెడికల్ ఆఫీసర్ విజయభాస్కర్, అరుణ్‌జ్యోతి ఆధ్వర్యంలో ప్రారంభించారు. మెడికల్ ఆఫీసర్, వైద్యులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

● **గోనెగండ్ల:** మండలంలోని ఐరన్‌బండ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు అపర్ణ, కార్తిక్, గౌరప్ప, తరుణ్ దాదాపు 350 మంది గ్రామస్తులకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరాన్ని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ పరిశీలించారు.

● **ఆస్పరి:** మండలంలోని బిల్లేకల్లు గ్రామంలో నిర్వహించిన శిబిరంలో దాదాపు 280 మందికి వైద్య సేవలందించినట్లు డాక్టర్ రఘురామిరెడ్డి తెలిపారు. ఎంపీడీఓ రాణెమ్మ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. సర్పంచ్ శ్రీను, డాక్టర్లు దుర్గాబాయి, మహేష్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

● **నందవరం:** మండల పరిధిలోని కనకవీడు పేట గ్రామంలో ఎంపీడీఓ దశరథ రామయ్య, తహసీల్దార్ నిత్యానందరాజు, సర్పంచ్ సరస్వతి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు సౌజన్యలత, పరిమళ, శ్రీచరణ్, తేజ కలిసి దాదాపు 358 మందికి వైద్య సేవలందించారు. 54 మందికి కంటి పరీక్షలు చేసి 15 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు.

● **ఆలూరు రూరల్:** ఆలూరు సచివాలయం–3 పరిధిలో ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపులో దాదాపు 450 మంది వివిధ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. మొలగవల్లి డాక్టర్ శాంతి, గైనకాలజిస్ట్ గుల్జాన్ వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. హెల్త్ సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది సేవలందించారు.



గోవర్ధనగిరి-2 హెల్త్ క్యాంప్‌లో రక్త పరీక్ష చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

సీఎం జగన్ మేలు మరువలేను



నేడు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. కొన్నేళ్లుగా బీపీ, షుగర్ ఉంది. వారం రోజుల క్రితం మా ఇంటికి వైద్యులు వచ్చి పరీక్షలు చేశారు. బుధవారం రోజు శిబిరానికి రాగా ఆరోగ్య సిబ్బంది దగ్గరుండి వైద్య పరీక్షలు చేయించి బీపీ, షుగర్ మాత్రలు ఇప్పించారు. ఇలాంటి కార్యక్రమం ప్రవేశపెట్టిన సీఎం జగన్ మేలు మరవలేనిది. – గోవింద రావు, ఆలూరు

ఎంతో ఉపయోగకరం



నేను షుగరు వ్యాధితో బాధపడుతున్నా. ఊర్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి వెళ్లగా నిపుణులైన డాక్టర్ వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇచ్చారు. కర్నూలు ఆసుపత్రిలో అడ్మిట్ కావాలని చెప్పారు. ప్రభుత్వం ఊళ్లలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం మాలాంటి వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంది. వ్యయప్రయాసలు తగ్గాయి.
– పెద్ద కౌలుట్ల, మారెల్ల







ఆలూరులో వైద్య సేవలందిస్తున్న డాక్టర్ శాంతి , చింతకుంట శిబిరంలో మాట్లాడుతున్న తహసీల్దార్ మల్లికార్జునస్వామి, పక్కన డిప్యూటీ డీఎంహెచ్ఓ సత్యవతి, అధికారులు, ఐరన్‌బండ గ్రామంలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్

క్లుప్తంగా

కరువు సహాయక చర్యలు చేపట్టాలి



ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: ఖరీఫ్ సీజన్‌లో సరైన వర్షాలు కురవక పండించిన పంటలు ఎండిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ప్రభుత్వం కర్నూలును కరువు జిల్లాగా ప్రకటించి సహాయక చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య కోరారు. సీపీఐ, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మిగనూరులో ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. రైతులను ఆదుకొనేందుకు ప్రభుత్వం పంటల బీమా వర్తింపజేయాలని, రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని, పంట నష్టపరిహారం అందించాలని కోరారు. నాయకులు పంపణ్ణగౌడ్, రంగన్న తదితరులు ఉన్నారు.

కృష్ణగిరి ఈఓఆర్డీగా మురళీమోహన్



కృష్ణగిరి: మండల ఈఓఆర్డీగా మురళీమోహన్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. వైఎస్సార్ జిల్లా ఏలమటూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి గ్రేడ్–1గా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చినట్లు ఆయన తెలిపారు. ఇక్కడ ఈఓఆర్డీగా పనిచేస్తున్న మోహన్ కుమార్ ఎంపీడీఓగా పదోన్నతిపై ఆత్మకూరుకు వెళ్లారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఈఓఆర్డీ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషిచేయాలని సూచించారు.

ఓటరు సర్వేపై సమీక్ష

హాలహర్వి: ఓటర్ సర్వేపై జిల్లా కలెక్టర్ జి.సృజన రెవెన్యూ శాఖల అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కొత్త ఓటర్ కార్డులు, సవరణలు ఏవైనా ఉంటే తొందరగా చేపట్టాలని ఆదేశించారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం నుంచి తహసీల్దార్ మల్లికార్జున, డీటీ లక్ష్మి, బీఎల్‌వోలు, సిబ్బంది వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం




స్వాధీనం చేసుకున్న మద్యంను చూపుతున్న ఎస్ఐ తిమ్మయ్య

నందవరం: కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని నందవరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. బుధవారం ఉదయం తెలంగాణ అయిజ మండలం తలమారికి చెందిన ముగ్గురు మోటార్ సైకిల్‌పై కర్ణాటక మద్యాన్ని తీసుకుని సోమలగూడూరు రామలింగప్పకు ఇచ్చేందుకు బయలుదేరారు. మండలంలోని నాగలదిన్నె గ్రామ క్రాస్ వద్ద సమాచారం మేరకు దాడులు చేసి నిందితులను, మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. తలమారికి చెందిన వినోద్‌కుమార్, మద్దిలేటి, గోవిందును అదుపులోకి తీసుకుని 384 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. మోటార్ సైకిల్ సీజ్ చేసి నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తిమ్మయ్య వెల్లడించారు.

కంపోస్ట్ యార్డు పరిశీలన

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని సోగనూరు రోడ్డులో ఉన్న కంపోస్ట్ యార్డ్‌ను బుధవారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు. పట్టణం నుంచి సేకరించి తెచ్చే తడి, పొడి చెత్త నుంచి కంపోస్ట్ యార్డ్‌లో ఎరువుల తయారు చేయడంపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. యార్డ్‌లో కంపోస్ట్ ఎరువు తయారీని పరిశీలించి పలు సూచనలు చేశారు. శానిటేషన్ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



పి.రేణుకాబాయ్

ఆలూరు: స్థానిక ప్రభుత్వ గిరిజన బాలికల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న పి.రేణుకాబాయ్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ షాహినూర్ తెలిపారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన పోటీల్లో ఆమె సత్తా చాటి రాష్ట్రస్థాయికి ఎంపికైందని చెప్పారు. రేణుకాబాయ్ ఈ నెల 7 నుంచి 9 వరకు వైఎస్సార్ జిల్లా మైదుకూరులో జరగనున్న పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని అభినందిస్తూ రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు.

సబ్సిడీ విత్తనాల పంపిణీ

మద్దికెర: ప్రతి రైతుకు సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేయడం జరుగుతుందని ఏఓ రవి అన్నారు. బుధవారం మండల పరిధిలోని బురుజుల గ్రామంలో విత్తన పంపిణీని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడు తూ గ్రామంలో పప్పుశనగ పంటను అత్యధికంగా సాగు చేస్తారన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా వెంటనే విత్తనాలు అందిస్తున్నామన్నారు.

'టీడీపీ నాయకుల భవిష్యత్‌కే గ్యారెంటీ లేదు'



టీడీపీని వీడి మంత్రి గుమ్మనూరు జయరాం సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన ముద్దటమాగి గ్రామస్తులు

ఆలూరు: అవినీతి కేసులో మాజీ సీఎం చంద్రబాబు నాయుడు జైలు పాలయ్యారని, ఆ పార్టీ నాయకులు భవిష్యత్తుకే గ్యారెంటీ లేదని మంత్రి గుమ్మనూరు జయరాం ఎద్దేవా చేశారు. ఆ పార్టీలో కొనసాగితే కార్యకర్తల బంగారు భవిష్యత్ నాశనమైనట్టేనని పేర్కొన్నారు. స్థానిక మంత్రి నివాసంలో మంగళవారం రాత్రి హొళగుంద మండలం ముద్దటమాగి గ్రామానికి చెందిన టీడీపీ మద్దతుదారులు, గ్రామ నాయకులు తిమ్మారెడ్డి, బసప్ప, వెంకటేష్, గాదిలింగప్ప, చాగప్ప, చాకలి నరసింహులు, బసప్ప మరో వంద కుటుంబాల వారు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారందరికీ మంత్రి వైఎస్సార్‌సీపీ కండువాలను వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత 35 ఏళ్లుగా టీడీపీ అభివృద్ధికి నిజాయితీగా కష్టపడుతూ, జెండామోసిన కార్యకర్తలకు ఎన్నడూ న్యాయం జరగలేదన్నారు. ఆ పార్టీలో పలువురు అడ్డదారిలో పదవులు చేజిక్కించుకుని అవినీతి, అక్రమాలకు పాల్పడడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. త్వరలోనే టీడీపీ ఖాళీ అవుతుందని జోస్యం చెప్పారు. సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమం, అభివృద్ధికి నిరంతరం పాటుపడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణస్వామి, శ్రీనివాసులు, భీరప్ప, నాగప్పనాయుడు తదితరులు ఉన్నారు.

చేసిన మేలును వివరిద్దాం



పత్తికొండలో వైఎస్సార్‌సీపీ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండటౌన్: 'వై ఏపీ నీడ్స్ జగన్' అనే కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి వెళ్లి వైఎస్సార్‌సీపీ పాలనలో చేసిన మేలును వివరిద్దామని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం పత్తికొండలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి (వై ఏపీ నీడ్స్ జగన్) అనే కార్యక్రమంపై ప్రత్యేక సమావేశం జరిగింది. నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీనాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీ ఈ కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ నాలుగున్నరేళ్ల కాలంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తెలుసుకుని పరిష్కారానికి కృషిచేయాలన్నారు. గ్రామాలలో 92 శాతం, పట్టణాలలో 84 శాతం మందికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, పార్టీలకు అతీతంగా అందరినీ కలసి వారి ఆశీస్సులు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాల్సిన ఆవశ్యకతను ప్రజలకు వివరించాలన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఎన్ని మంచి పథకాలు అమలుచేస్తున్నా ప్రతిపక్ష టీడీపీ, ఎల్లో మీడియా అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. వారి ప్రచారాన్ని తిప్పి కొట్టి, ప్రజలకు వాస్తవాలను వివరించాలన్నారు. ఎంపీపీలు మాల నారాయణదాసు, డాక్టర్ కంగాటి వెంకట్రామిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సమీర్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీరంగడు, నాయకులు రవిరెడ్డి, నాగరాజు, సోమశేఖర్, బాబురెడ్డి, పల్లె ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురజాల ఈఓపై డీసీకి ఫిర్యాదు

కర్నూలు కల్చరల్: నందవరం మండలం గురజాల రామలింగేశ్వర స్వామి ఆలయ ఈఓ దినేష్‌పై డిప్యూటీ కమిషనర్ పట్టెం గురుప్రసాద్‌కు ఆలయ చైర్మన్ పెద్ద నరసింహులు ఫిర్యాదు చేశారు. ఈఓ ఆలయానికి రావడం లేదని, ఫోన్ చేసినా స్పందించడం లేదని, దసరా ఉత్సవాలు నిర్వహించాలో లేదో కూడా స్పష్టత లేదని బుధవారం కర్నూలు డివిజన్ దేవదాయ శాఖ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ పట్టెం గురుప్రసాద్‌కు చైర్మన్ లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన.. ఈఓకు మెమో ఇచ్చి వివరణ కోరాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. దసరా ఉత్సవాల నిర్వహణకు ఎలాంటి ఇబ్బంది ఉండదని చైర్మన్‌కు హామీ ఇచ్చారు.

చక్రాళ్లలో ఇరువర్గాల ఘర్షణ

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని చక్రాళ్ల గ్రామంలో భూసర్వే వివాదం రెండు వర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. గ్రామంలోని 106 సర్వే నంబర్‌లో 20 ఎకరాల మేర కొండ పోరంబోకు స్థలానికి పట్టాదారు పాసుపుస్తకాలు చేసుకున్నారని ఓ వర్గం వారు ఆరోపించగా మీరు కూడా ఎన్నో భూములు మీ పేరిట పట్టా చేసుకున్నారని వైరి వర్గం వారు ఆరోపించారు. మాటమాట పెరిగడంతో పరస్పరం దాడులు చేసుకుని మంగళవారం రాత్రి స్టేషన్‌ను ఆశ్రయించి ఒకరిపై ఫిర్యాదు చేసుకున్నారు. బుధవారం గ్రామానికి చెందిన కాంతిరెడ్డి పత్తికొండ తేరుబజారు ప్రాంతంలో టీ స్టాల్ వద్ద ఉండగా శ్రీనివాసులు అనే వ్యక్తి తనపై దాడికి దిగాడని సీఐ మురళీమోహన్‌కు ఫిర్యాదు చేశాడు. గొడవలకు తావు లేకుండా భూ సమస్యలను అధికారుల ద్వారా పరిష్కరించుకోవాలని సీఐ సూచించారు.

దశమి ఉత్సవాలు ప్రారంభం

గోనెగండ్ల: గోనెగండ్లలో వెలసిన చింతలాముని, నల్లారెడ్డి స్వాముల దశమి మహోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలకు రాష్ట్రం నుంచే కాక తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివస్తారు. దీంతో పిల్లల ఆటవస్తువుల దుకాణాలు, గాజుల షాపులు, రంగుల రాట్నాలు, తినుబండారాల షాపులను ఏర్పాటు చేశారు. తెల్లవారుజామున 2 గంటలకు గుర్రపు పల్లకీ సేవతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. గురువారం దశమి మహోత్సవం జరగనుంది. భక్తులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు, నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నలుగురు ఎస్ఐలు, 80 మంది పోలీసులు, ఆరుగురు మహిళ పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు.

నేటి హెల్త్ క్యాంపుల షెడ్యూల్

తుగ్గలి/కృష్ణగిరి: తుగ్గలి మండల పరిధిలోని పెండేకల్లులో, కృష్ణగిరి మండల పరిధిలోని టి.గోకులపాడు గ్రామ సచివాలయంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓలు సావిత్రి, విశ్వమోహన్ తెలిపారు. ఆరోగ్య సమస్యలున్న వారు వైద్య శిబిరానికి హాజరై పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. శిబిరంలో నిపుణులైన డాక్టర్లతో వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు అందిస్తారని వెల్లడించారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

దేవనకొండ: కార్యకర్తలకు అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ నాయకుడు, దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. కప్పట్రాళ్ల గ్రామంలో బుధవారం వైఎస్సార్‌సీపీ కార్యకర్త వన్నూరప్ప మరణించాడు. విషయం తెలుసుకున్న ఆయన గ్రామానికి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. వన్నూరప్ప మృతి పార్టీకి తీరనిలోటని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మల్లికార్జున, దివాకర్‌నాయుడు తదితరులు నివాళులర్పించారు.

శ్మశాన వాటికలో బోరు ఏర్పాటు

ఎమ్మిగనూరుటౌన్: ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని ఎస్సీ శ్మశాన వాటికలో నీటి వసతి కోసం బుధవారం కొత్తగా బోరు వేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ పట్టణ అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, యంబీ చర్చి పాస్టర్ జయన్న తదితరులు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపి మొక్కలు నాటారు.

27న ముసాయిదా ఓటరు జాబితా



మాట్లాడుతున్న ఆర్వో మల్లికార్జున

ఆలూరు రూరల్: ఈ నెల 27వ తేదీన ఆలూరు నియోజకవర్గ ముసాయిదా ఓటరు జాబితా ప్రదర్శించనున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి మల్లికార్జున అన్నారు. బుధవారం ఆయన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్ఓ సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. బీఎల్ఓలు ఇంటింటికీ తిరిగి పరిశీలించిన ప్రకారం ఓటరు జాబితా సవరణను పూర్తి చేశామన్నారు. ఆలూరు నియోజకవర్గంలో మొత్తం 2,49,524 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఫారం-6 కొత్త ఓటర్లు 7,543 నమోదు కాగా 1,053 తిరస్కరణకు గురయ్యాయని, 169 పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. 6,764 ఓటర్ల తొలగింపునకు సిఫార్సులు రాగా ఇందులో 5,378 మంది (చనిపోయిన, గ్రామ విడిచి వెళ్లిన, వివాహం చేసుకుని వెళ్లిన వారు ఉన్నారన్నారు). అలాగే పేర్లు, ఫొటో, చిరునామా మార్పునకు 4,976 ఫారాలు అందగా 4,555 స్వీకరించామని, 211 తిరస్కరణ, మరో 210 పెండింగ్‌లో ఉంచామన్నారు. 27న ఓటరు జాబితా విడుదలపై అభ్యంతరాలు ఉంటే మరోసారి దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. డిసెంబర్ చివరికల్లా మార్పులు చేర్పులు పూర్తిచేసి వచ్చే ఏడాది జనవరి 5వ తేదీన ఓటరు తుది జాబితా విడుదల చేస్తామని చెప్పారు. తహసీల్దార్లు రామాంజినేయులు, కుమార స్వామి, లక్ష్మినారాయణ, ఈడీటీ గుండాల్ నాయక్, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ బసన్న గౌడ్ ఉన్నారు.



గురజాలలో లబ్ధిదారులకు సంక్షేమ క్యాలెండర్‌ను అందజేస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి

గడప గడపకు సంక్షేమం

నందవరం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలతో ఇంటింటికీ సంక్షేమం చేరువైందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని గురజాల గ్రామంలో రెండవ రోజు 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు అడిగిన సీసీ రోడ్లు, తాగునీటి వసతి కల్పిస్తామని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షులు జె.శివారెడ్డి గౌడ్, ముగతి సర్పంచ్ విరుపాక్షిరెడ్డి, గ్రామ సర్పంచ్ వీరస్వామి, నాయకులు నరసింహారెడ్డి, ఎంపీడీఓ దశరథరామయ్య తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో తల్లీబిడ్డ ఆరోగ్యం పదిలం



గర్భిణులకు సామూహిక సీమంతం చేస్తున్న ఐసీడీఎస్ సుపర్‌వైజర్ షీభారాణి

హొళగుంద: అంగన్‌వాడీ కేంద్రాలలో గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అవసరమైన పౌష్టికాహారం, చదువు, మంచి సౌకర్యాలు లభిస్తున్నాయని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సుహాసినమ్మ, ఐసీడీఎస్ సుపర్‌వైజర్ షీభారాణి అన్నారు. బుధవారం హొళగుంద స్త్రీ శక్తి భవనంలో గర్భిణులకు సామూహిక సీమంతం, పిల్లల ఆరోగ్య పరిశీలన, అన్నప్రాసన, న్యూట్రిషన్ స్టాల్ ఏర్పాటు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. డాక్టర్ బింధుమాధవి గర్భిణులకు ఆరోగ్య జాగ్రత్తలు, పిల్లల పెంపకం అనేక విషయాలను వివరించారు. ఎంపీపీ నూర్జహాన్‌బీ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

చిప్పగిరి: పౌష్టికాహారంతో తల్లీబిడ్డల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని సీడీపీఓ లలిత అన్నారు. బుధవారం స్థానిక గ్రామ సచివాలయంలో పోషకాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ సీపీ కొండయ్య, ఏఓ విజయ లక్ష్మి, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

మద్దికెర: ఆకుకూరలు, తాజా కూరగాయలు తీసుకోవడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ సావిత్రిదేవి అన్నారు. బుధవారం స్థానిక వైకేపీ భవనంలో గర్భిణులకు సామూహిక సీమంతం చేశారు. చిరుధ్యాన్యాల వంటకాలు తయారు చేసి అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్లు సౌభాగ్యలక్ష్మి, అంబిక, త్రివేణి, సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీ తనిఖీ

హొళగుంద: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ను బుధవారం జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ జీసీడీఓ సునీత, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ మారుతి, గూడూరు ఎంఈఓ సునీలమ్మతో కూడిన త్రిసభ్య కమిటీ తనిఖీ చేసింది. విద్యాలయంలో బాలికలకు వసతి, నాణ్యమైన భోజనం, విద్యా సైకర్యాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. కొద్ది సేపు విద్యార్థినులతో ముచ్చటించిన అధికారులు వారితో కలిసి భోజనం చేశారు. విద్యాలయ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. విద్యాలయ నిర్వహణపై వచ్చిన ఆరోపణలపై తనిఖీ చేశారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని జీసీడీఓ తెలిపారు.



హొళగుంద కేజీబీవీలో బాలికలతో కలిసి భోజనం చేస్తున్న ఎస్ఎస్ఏ జీసీడీఓ సునిత